క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. 32వ వార్డు భీష్మనగర్‌కు చెందిన మత్స్యకార్మికుడు చేపలకు వెళ్లి వరదలో చిక్కుకుని మరణించగా అతనికి ప్రమాదబీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును అతని భార్య జమునకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని, నియోజకవర్గంలో 50 వేలకు పైగా కార్యకర్తలు సభ్యత్వం తీసుకున్నరన్నారు. చురుకైన కార్యకర్తను కోల్పోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంగమల్లు, శంకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోలు కేంద్రంలో ఆర్డీవో ఆనంద్ కుమార్

కథలాపూర్: మండలంలోని దుంపేట, కథలాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం పరిశీలించి త్వరగా తూకం వేయించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నాగేశ్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ,ఎస్సై

కథలాపూర్: మండల పోలీస్‌స్టేషన్‌ను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నమోదైన కేసులు, పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించారు. మండలంలో శాంతిభద్రతల సమస్యలపై చర్చించారు. ఆయన వెంట ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం



ఉపాధి పనులపై వివరిస్తున్న ఏపీవో

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలపై రిసోర్స్ పర్సన్లకు, కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమన్వయ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఏడాది కాలంలో రూ. 3 కోట్లతో ఉపాధిహామీ పనులు చేపట్టామన్నారు. వీటికి సంబంధించిన రికార్డుల ప్రకారం తనిఖీలుంటాయన్నారు. తనిఖీలకు వచ్చే రిసోర్స్‌పర్సన్లకు గ్రామాల్లో సిబ్బంది సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, ఎస్ఆర్పీ భగవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజారం మాజీ సర్పంచ్‌కు ఉత్తమ సేవా పురస్కారం



సుగుణ

మల్యాల: మండలంలోని రాజారం మాజీ సర్పంచ్ ఎడిపల్లి సుగుణ గ్రామాభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి జాతీయస్థాయి ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమీ సెలక్షన్ కమిటీ సభ్యుడు కాయితీ శంకర్ తెలిపారు. సమాజంలో ఉత్తమ సేవలందిస్తున్న వారికి ఏటా జాతీయస్థాయి పురస్కారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాజారంలో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు, మురికాలువల నిర్మాణం నూతన గ్రామ పంచాయతీ భవనం వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.3.35 కోట్లు వెచ్చించారని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేసినందుకు అవార్డు వరించిందని తెలిపారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- 23 గ్రామాల్లోని వన నర్సరీల్లో పెంపకం
- అందుబాటులో 4 లక్షల మొక్కలు
- ప్రతీ గ్రామంలో 10 వేల మొక్కలు నాటడమే లక్ష్యం



పెగడపల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

పెగడపల్లి: పర్యావరణాన్ని కాపాడేందుకు గత ప్రభుత్వం హరితహారం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేసింది. ఈ సారి కూడా అదే తరహాలో హరితహారం విజయవంతం చేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలు ఏర్పాటు చేసి ఒక్కో నర్సరీలో 15 నుంచి 20 వేల మొక్కలు పెంచుతున్నారు. ప్రధానంగా 30 నుంచి 40 ఏళ్ల వరకు జీవించే మొక్కలతో పాటు పలు రకాల పూల మొక్కలకు ప్రాధాన్యం ఇచ్చి నర్సరీల్లో సిద్ధం చేస్తున్నారు. ఉపాధిహామీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో మొక్కల మధ్య కలుపు తీయడం, నీరు పోయించడం పనులు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవోలు తరచూ నర్సరీలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నర్సరీలు

ఇప్పటి వరకు పలు దఫాలుగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేసినప్పటికీ నిర్వహణలోపంతో మొక్కలు అనుకున్న స్థాయిలో దక్కడం లేదు. ఈ సారి మొక్కలు నాటేందుకు ప్రభుత్వ స్థలాలు, గ్రామాలు, పొలాల్లో ఎక్కడ చూసినా చెట్లు కనిపించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. చెట్లు అధికంగా ఉంటే వానలు బాగా కురుస్తాయని, వాతావరణ కాలుష్యం తగ్గుతుందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు.

వర్షాలు ప్రారంభ దశలోనే..

జూన్‌లో వర్షాలు మొదలవ్వగానే మొక్కలు నాటేందుకు అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు సమాచారం ఇచ్చారు. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో 10 వేల మొక్కలకు తగ్గకుండా నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ మేరకు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో గ్రామానికి 10 నుంచి 15 వేల మొక్కలు అవసరమని గుర్తించారు.

అందుబాటులో మొక్కలు



ప్రతీ గ్రామంలో 10 నుంచి 15 వేల మొక్కలు నాటేందుకు కావాల్సిన మొక్కలను పెంచుతున్నాం. మండలంలోని 23 నర్సరీల్లో 4 లక్షల పైగా ఉపాధిహామీ పథకంలో మొక్కలు పెంచుతున్నాం. మొక్కలు సరిపడక పోతే ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తాం. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో హరితహారం విజయవంతం చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీవో

సెల్‌టవర్ నిర్మించొద్దని ఆందోళన



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ముప్పారపు ట్యాంక్ సమీపంలోని బైపాస్‌రోడ్ జంక్షన్ సమీపంలో ఓ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ టవర్‌ను నిర్మించొద్దని స్థానికులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. సెల్ టవర్ రేడియేషన్ ప్రభావంతో పిల్లలు, పెద్దలందరికీ ఇబ్బందులు ఎదురవుతాయని, కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సోమవారం పనులను ప్రారంభించారు. దీంతో సుమారు 200లకు పైగా కాలనీవాసులు సంఘటన స్థలానికి చేరుకుని టవర్ నిర్మిస్తే ఊరుకునేది లేదంటూ ఆందోళనకు దిగారు. దీంతో సంబంధిత కాలనీవాసులంతా కలిసి కమిషనర్‌కు ఫోన్‌చేశారు. సెల్‌టవర్ నిర్మాణానికి అనుమతి ఎలా ఇచ్చారని, ఇక్కడ ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొనడంతో ఆందోళన విరమించారు. కాలనీవాసులు లేని సమయంలో నిర్మాణం చేపడుతున్నారని, ఇప్పటికైనా పనులు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తి చేయాలని ఎంపీడీవో రమాదేవి అన్నారు. సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రతీ పాఠశాలలో మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పాఠశాలల మరమ్మతు పనులు, జూన్ 12లోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ ప్రతి గ్రామపంచాయతీలో ప్రతిరోజు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్, ఎంపీవో రవిబాబు, ఏఈ రాజమల్లయ్య, ఎంఈవో గాయత్రి, పశువైద్యాధికారి నరేశ్, సూపరింటెండెంట్ గంగాధర్, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతుల కోసం రూ. 1.31 కోట్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యుత్ పనులు, తాగునీటి వసతి, మూత్రశాలలకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, తహసీల్దార్ ప్రసాద్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

పెగడపల్లి:పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతుల పనులు వెంటనే పూర్తి చేయించాలని మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు పనుల పర్యవేక్షణకు నియమించిన సూపర్‌వైజర్లతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. గుర్తించిన పనులు, వాటి పురగోతిపై చర్చించారు. పాఠశాలలు పునఃప్రారంభం కాకాముందే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పీఆర్ ఏఈ షంశేర్ అలీ, ఏపీఎం సమత పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై గౌతం పవార్

సారంగాపూర్: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు పెరిగిపోతున్నారని వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీర్‌పూర్ ఎస్సై గౌతంపవార్ అన్నారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లిలో సోమవారం సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఇటువంటి సంఘటన ప్రజలకు ఎదురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఇంటి పెద్ద చూడాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు తరలించేందుకు కృషి

మల్యాల: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే తరలించేందుకు కృషి చేస్తామని మల్యాల తహసీల్దార్ మునీందర్ అన్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు తరలించేందుకు లారీలు రావడం లేదని, బస్తాలు తరలించాలని లంబాడిపల్లి గ్రామ రైతులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. లంబాడిపల్లి కొనుగోలు కేంద్రంలో సుమారు 4200 తూకం బస్తాలు నిల్వ ఉన్నాయని, మరో ఐదు వేల క్వింటాళ్ల మేర తూకం వేయాల్సి ఉందని, తూకం వేసిన బస్తాలు అకాల వర్షానికి తడుస్తున్నాయని రైతులు తహసీల్దార్‌కు విన్నవించారు. కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సందర్శించి, లారీలు పంపినట్లు రైతులు తెలిపారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని తూకం వేసి, బస్తాలు తరలించాలని కోరుతూ బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మెట్‌పల్లి: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఆర్యవైశ్య విద్యార్థులకు సోమవారం పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో సంఘం ఆధ్వర్యంలో అవార్డులు అందజేశారు. సుమారు 40 మంది విద్యార్థులకు వీటిని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మైలారపు లింబాద్రి, పట్టణాధ్యక్షుడు మైలారపు రాములు,నాయకులు కిరణ్‌కుమార్, నవీన్, మహేశ్ పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్‌పై కేసు

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్ బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచేసే దూడ నల్లపోచయ్య గ్రామానికి చెందిన పలువురి డబ్బులను తమ ఖాతాలలో జమ చేస్తానని నమ్మబలికి డబ్బులను తన సొంత అవసరాలకు వాడుకున్నాడని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీస్ జగిత్యాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గొల్లపల్లి ఎస్సై సతీష్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కోరుట్లరూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం,బీఎస్సీ, బీఏ ఉర్దూ మీడియం విభాగాల్లో 360 సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ నీలి వాసవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ –దోస్త్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్లు మొదలయ్యాయని తెలిపారు.మొదటి విడతలో రూ.200 రెండో విడత, మూడవ విడతలో రూ.400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని మొదటి ప్రాధాన్యతగా కోరుట్ల కళాశాలను ఎంపిక చేసుకుని అడ్మిషన్ పొందవచ్చని, మొదటి విడత ఈ నెల 29 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కోరుట్ల పరిసర ప్రాంత విద్యార్థినులకు కళాశాల ఆవరణలో వసతి గృహం, కోరుట్ల పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బాలుర వసతి గృహం ఉందని, వివరాలకు 8341208221,8500093263 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎంపిక కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

జగిత్యాల: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ కోసం ఎంపిక నిర్వహిస్తుందని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కోరుకంటి రవికుమార్ తెలిపారు. అగ్నివీర్ వాయు అవివాహిత పురుషులు, మహిళలు ఖాన్‌పూర్‌లోని మూడు ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వాయు, ఇంటెక్ రిక్రూట్ మెంట్ కోసం నోటిఫికేషన్ జారీ అయినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ మే 22 నుంచిజూన్ 5న 11 గంటల వరకు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం




విరాళం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో అతి పురాతన శివాలయం అభివృద్ధికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం రూ.20 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు యూత్ సభ్యులకు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించి సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు వినియోగించుకోండి

బుగ్గారం: భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట సాగుచేయాలని మండల వ్యవసాయ అధికారి షాహీద్ అలీ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల విక్రయంను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను తీసుకోవడానికి రైతులు తమ ఆధార్ కార్డు,పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లను సమర్పించి ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో, డీసీఎంఎస్ కేంద్రాల్లో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు అక్షయ్‌కుమార్,ఆగ్రోస్ సేవా కేంద్రం నిర్వాహకుడు బుక్క ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు బీఆర్ఎస్ చేసిందేమీలేదు



మాట్లాడుతున్న నాయకులు

మల్లాపూర్: పదేళ్ల పాలనలో రైతులకు బీఆర్ఎస్ చేసిందేమి లేదని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు పాతకాల కిరణ్ అన్నారు. మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో సోమవారం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేస్తున్న రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కంటే ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చితే, దాన్ని అధిగమించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు హామీలన్నింటిని అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉందన్నారు.సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నా.. అడ్డుకునే వారేవరు



సమావేశానికి హాజరైన అధికార పార్టీ నాయకులు

మల్లాపూర్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే సమావేశంలో మండల అధికారుల సాక్షిగా ఓ పార్టీ నాయకులు దర్జాగా పాల్గొన్న ఘటన మల్లాపూర్ మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం చోటుచేసుకుంది. అమ్మ ఆదర్శ కమిటీ సమీక్ష సమావేశానికి అధికార పార్టీ నాయకులను పిలవడంపై మండలస్థాయి అధికారులపై విపక్ష ప్రజాప్రతినిధులు, నాయకులు మండిపడ్డారు. ప్రోటోకాల్‌తో పాటు ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాల్సిన సదరు అధికారులే ఉల్లంఘనకు పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికార పార్టీ నాయకులు పాల్గొనడంపై ఎంపీడీవో రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా సమావేశానికి ప్రత్యేకాధికారులు, వీవోఏలను పిలవాలని పీఆర్ ఏఈ నిరంజన్‌రెడ్డికి సూచించామని, సమావేశంలో పాల్గొనేంతవరకు అధికార పార్టీ నాయకులు వచ్చిన విషయం తనకు తెలియదని సమాధానమిచ్చారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా హరిప్రసాద్



కథలాపూర్: బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా మండలం పోతారం గ్రామానికి చెందిన పులి హరిప్రసాద్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హరిప్రసాద్ మండలంలో బీసీలను చైతన్యపరిచి వారి సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి మండలాధ్యక్షుడిగా నియమించామని పేర్కొన్నారు. తన నియామకానికి కృషిచేసిన జిల్లా ప్రతినిధులకు హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

మెట్‌పల్లి డివిజన్ కార్యదర్శిగా అంజయ్య

మెట్‌పల్లిరూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి డివిజన్ కార్యదర్శిగా సాదుల అంజయ్య నియమిస్తూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు సోమవారం నియామక పత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు,తదితరులు ఉన్నారు.

మఠమాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

మల్యాల: మండల కేంద్రంలోని మఠమాంజనేయ స్వామి ఆలయ వా25వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభించారు. ఉదయం 6.30గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. రోటిగూడ శ్రీహరి మౌనస్వామి ధర్మ ధ్వజారోహణ చేసి, వార్షికోత్సవ వేడుకలు ప్రారంభించారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలో జంబిగద్దె ప్రాంతం, అశోక్‌నగర్, మోతెరోడ్, నాగేంద్రనగర్, చిలుకవాడ, గాయత్రిబ్యాంక్ ఏరియా, మోచీ బజార్, బుకవాడ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం, నాగులపేట, మేడిపెల్లి మండలం వల్లంపెల్లి, మెట్‌పల్లి మండలం పెద్దాపూర్, రాంరావుపల్లె గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో కోరుట్ల రూరల్ ఏఈ భుక్యా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటలనుంచి 11 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ సోమవారం తెలిపారు.

నేడు రైతులకు శిక్షణ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 9 గంటలకు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కొత్తగా విడుదల అయిన వరి రకాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏవో దీపిక సోమవారం తెలిపారు. రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జాతీయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల:ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డుల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వాణిశ్రీ తెలిపారు. జిల్లాలో వివిధ రంగాల్లో సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళల సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇతరరంగాల్లో ప్రతిభ చూపిన 6 నుంచి18 ఏళ్ల బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను 31–07–2024లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు బాలరక్షణ భవన్ 98854 97287లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ పరికరాలు కొత్తవి అమర్చాలి

జగిత్యాలజోన్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో పాడైన పరికరాల స్థానంలో కొత్తవి అమర్చాలని వరంగల్ ఐపీసీ చీఫ్ ఇంజినీర్, జిల్లా నోడల్ అధికారి తిరుమల్‌రావు అన్నారు. జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్లపై దృష్టి సారిస్తూ కరెంట్ ట్రిప్పింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అధికలోడు ఉన్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అన్ని కేటగిరీలకు చెందిన విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించి సంస్థకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. సబ్‌స్టేషన్లతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, 33/11 కేవీ విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయాలని సూచించారు. వినియోగదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, ఎస్ఏవో తిరుపతయ్య, డీఈలు గంగా రాం, రాజిరెడ్డి, టెక్నికల్ ఏడీఈ నగేశ్‌కుమార్ పాల్గొన్నారు.

24న విత్తనమేళా

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ పరిశోధనస్థానంలో ఈనెల 24న విత్తనమేళా నిర్వహిస్తున్నట్లు పరిశోధనస్థానం డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జగిత్యాల రైస్–1 (జేజీఎల్–24423), జగిత్యాల రైస్–2 (జేజీఎల్–28545), జగిత్యాల రైస్–3 (జేజీఎల్–27356), జేజీఎల్ 33124, జేజీఎల్ 28639 విత్తనాలను అమ్మకానికి పెట్టినట్లు తెలిపారు. ఒక్కో సంచి ధర రకాన్ని బట్టి రూ.750 నుంచి రూ.1100 వరకు ఉన్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003-2006 బ్యాచ్ విద్యార్థులు, అధ్యాపకులు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003–2006 బ్యాచ్ బీఏ గ్రూప్ పూర్వ విద్యార్థులు అధ్యాపకులతో కలిసి సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. విద్యార్థులు ఒకే చోట చేరి తమ చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ వాసవి,అధ్యాపకులు వెంకన్న, దోనె తిరుపతిలను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో 2003–2006 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్మా విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు

పట్టణంలోని మహాత్మా విద్యానికేతన్ 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పట్టణంలో స్థానిక ఫంక్షన్ హాల్‌లో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన చిన్ననాటి గురువులను సన్మానించారు.